

ఖాళీ బిందెలతో నిరసనకు దిగిన మహిళలు

పన్నులు కట్టించుకుని.. నీరివ్వరా?

తాగునీటి కోసం ధర్మవరంలోని వైఎస్ఆర్ కాలనీ వాసులు మంగళవారం రోడ్డెక్కారు. పట్టణంలోని 27వ వార్డులో వారం రోజులుగా తాగునీరు సరఫరా కాలేదు. దీంతో ఆగ్రహించిన కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో ధర్మవరం నుంచి ఎన్ఎస్ గేటుకు వెళ్లే రహదారిపై నిరసనకు దిగారు. కాలనీకి తాగునీరు సరఫరా చేసేవరకు కదిలేది లేదని భీష్మించారు. చెత్త, ఇంటి, నీటి పన్నులు ముక్కుపిండి వసూలు చేస్తారు కానీ, తాగునీరు మాత్రం సరఫరా చేయలేరా అని వారు ప్రశ్నించారు. పన్ను కట్టడం ఆలస్యమైతే కొళాయి కనెక్షన్ తొలగిస్తారుగానీ, అలాంటపుడు నీరెందుకు సక్రమంగా ఇవ్వరంటూ మండిపడ్డారు. మున్సిపల్ పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. మహిళల నిరసనతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఇప్పటికైనా తాగునీటి సమస్య పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మహిళలు హెచ్చరించారు. గంటపాటు ఆందోళన కొనసాగించారు.



మహిళల నిరసనతో స్తంభించిన ట్రాఫిక్

-ధర్మవరం



తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న రైతులు

పంటలు ఎండుతున్నా.. పట్టించుకోరా..?

విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నా పట్టించుకోరా అంటూ అన్నదాతలు మండిపడ్డారు. అమరాపురం మండలంలోని చిట్నడుకు గ్రామానికి చెందిన రైతులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. రూ.వేలు, రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి బోరుబావుల పంటలు సాగుచేశామనీ, విద్యుత్ కోతలతో అవి ఎండిపోతున్నాయని వాపోయారు. రోజుకు రెండుగంటలు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా చేయకపోతే పంటలను ఎలా రక్షించుకోవాలని మండిపడ్డారు. ఇలాగైతే తాము పూర్తిగా నష్టపోవాల్సిందేనని ఆవేదన చెందారు. సమస్యపై విద్యుత్ శాఖాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పరిష్కారం కాలేదని మండిపడ్డారు. వెంటనే సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రెండున్నర గంటలపాటు అక్కడే బైఠాయించారు. తహసీల్దార్ వెంకటసుబ్బయ్య.. రైతుల వద్దకు చేరుకుని, మాట్లాడారు. సమస్య పరిష్కరించాలంటూ రైతులు వినతిపత్రం అందించారు. ఉన్నతాధికారులకు నివేదిస్తానని తహసీల్దార్ చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

- మడకశిర టౌన్

రేపట్నుంచి నారా లోకేశ్ శంఖారావం

- జిల్లాలో ఐదుచోట్ల సభలు
- హిందూపురంలో ప్రారంభం
- కదిరిలో ముగింపు..
- ఏర్పాట్లలో నేతలు, శ్రేణులు



పుట్టపర్తి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ చేపట్టిన శంఖారావం యాత్రలో భాగంగా రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈనెల 7, 8 తేదీల్లో జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో శంఖారావం సభలు నిర్వహించనున్నారు. 7న ఉదయం హిందూపురంలో తొలి సభ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం మడకశిరలో, సాయంత్రం పెనుకొండలో సభల్లో నారా లోకేశ్ ప్రసంగిస్తారు. అదేరోజు రాత్రి ఆయన పుట్టపర్తి చేరుకుని, బస చేస్తారు. 8న పుట్టపర్తి, కదిరి నియోజక వర్గాల్లో పర్యటిస్తారు. శంఖారావం సభలకు ఆయా నియోజకవర్గాలో ఏర్పాట్లు చేస్తున్నారు. సభలను విజయవతం చేసేందుకు టీడీపీ, జనసేన పార్టీ నేతలు, శ్రేణులు, జిల్లా ప్రజలు సమాయత్తమయ్యారు.

నేడు పురానికి రాక

హిందూపురం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ బుధవారం సాయంత్రం హిందూపురానికి రానున్నారు. శంఖారావం కార్యక్రమం హిందూపురం పట్టణ పరిధిలోని కొల్లకుంట వద్ద గురువారం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన బుధవారం మధ్యాహ్నం 2.30కు పుట్టపర్తి ఎయిర్‌పోర్టుకు ప్రత్యేక విమానంలో చేరుకోనున్నారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన కొల్లకుంట వద్ద ఏర్పాటు చేసిన సభాస్థలిలో ప్రత్యేక బస్సులో బస చేయనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ఇప్పటికే సభాస్థలి ఏర్పాట్లలో నాయకులు నిమగ్నమయ్యారు. గురువారం ఉదయం 9 గంటలకు భారీ బహిరంగ సభ ఉంటుంది. మధ్యాహ్నం మడకశిర, సాయంత్రం పెనుకొండలో శంఖారావం సభలు నిర్వహించనున్నారు.

భారీ ఏర్పాట్లు

నారా లోకేశ్ 2014 ఎన్నికల ప్రచారంలో భాగంగా హిందూపురానికి వచ్చారు. నందమూరి బాలకృష్ణ ఎమ్మెల్యే అయ్యాక తొలిసారిగా హిందూపురానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశాలు ఇచ్చారు. కొల్లకుంట ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఎనిమిది ఎకరాల స్థలంలో సభ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. లోకేశ్‌కు భారీ స్వాగత ఏర్పాట్లు చేపట్టాలని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు.. శ్రేణులు, కార్యకర్తలకు సూచనలు ఇచ్చారు.

లేపాక్షి హుండీ గలగల

భారీగా పెరిగిన ఆదాయం



ఆలయంలో హుండీని లెక్కిస్తున్న దృశ్యం

లేపాక్షి, మార్చి 5: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గావీరభద్రస్వామి హుండీ ఆదాయం భారీగా పెరిగింది. నాలుగు నెలల కాలానికి రూ.5.68 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ వర్గాలు తెలిపాయి. ఎన్నడూలేనివిధంగా హుండీ ఆదాయం పెరగడంతో భక్తులు, కమిటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. హుండీ లెక్కింపును మంగళవారం ఉదయం ప్రారంభించారు. హుండీ ఆదాయం భారీగా పెరగడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈఓ నరసింహమూర్తి, గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 244 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మార్చి 5: జిల్లావ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఆంగ్ల పరీక్షకు 244 మంది గైర్హాజరయ్యారని ఆర్ఐఓ సురేశ్‌బాబు తెలిపారు. మొత్తం 9031 మందికిగాను 244 మంది గైర్హాజరయ్యారన్నారు. 8787 మంది పరీక్షలు రాశారని ఆయన తెలిపారు.

అడవికి ఆపద..!



- వేసవి రాకనే వనాలకు నిప్పు
- వృక్షజాతులు, వన్యప్రాణులు బుగ్గి
- పరిరక్షణ చర్యలకు నిధులలేమి
- పైసా విదల్చని ప్రభుత్వం
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- చేతులెత్తేస్తున్న అటవీ శాఖ

పుట్టపర్తి, ఆంధ్రజ్యోతి



అడవికి ఆపదొచ్చి పడింది. వేసవి రాకనే మంటలు చెలరేగుతున్నాయి. కార్చిచ్చు అడవిని దహించేస్తోంది. వృక్షజాతులు, వన్యప్రాణాలను బుగ్గి చేస్తోంది. అగ్నిని అడ్డుకుందామన్నా.. వనసంపదను రక్షించుకుందామన్నా.. పైసా నిధుల్లేవు. సిబ్బంది కొరత కూడా అటవీ శాఖను వేధిస్తోంది. అడవిని అగ్నికి అప్పగించాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లాలో అటవీ సంపదతోపాటు వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఏటా వేసవి వచ్చిందంటే చాలు అటవీ, కొండ ప్రాంతాలు అగ్నిబారిన పడుతున్నాయి. పచ్చని అటవీసంపద కాలిబూడిదవుతోంది. ఈసారి వేసవి రాకమునుపే జిల్లా కేంద్రం సమీపంలోని మల్లప్పకొండలతోపాటు పలు ప్రాంతాల్లో అడవులు అగ్ని బారిన పడ్డాయి. దీంతో అటవీశాఖ పరుగులు పెట్టాల్సి వచ్చింది. కార్చిచ్చు దహిస్తుండడం, అడ్డుకోవడంలో వైఫల్యం కారణంగా కొన్నేళ్లుగా అటవీ విస్తీర్ణం కుంచించుకుపోతోంది. పచ్చదనం కనుమరుగవుతూ వన్యప్రాణులు బిక్కుబిక్కుమంటూ బతికేరోజులు వచ్చాయి. కాస్తోకూస్తో ఉన్న అటవీ సంపద కూడా వేసవిలో కొందరు స్వార్థపరులు, ఆకతాయిల చర్యలకు అగ్నికి ఆహుతైపోతోందన్న ఆందోళన నెలకొంది. అటవీ అభివృద్ధి, సంరక్షణ కోసం సాంకేతికత క అందుబాటులోకి వచ్చినా.. ప్రయోజనం లేదు. నాలుగున్నరేళ్లుగా జిల్లాలో అటవీశాఖకు కేంద్ర, రాష్ట్రాలు అరకొరగా నిధుల కేటాయింపుతో అటవీ సంరక్షణ కష్టతరమవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అడవుల్లో అగ్ని ప్రమాదాలను తక్షణమే గుర్తించే శాటిలైట్ ఫైర్ అలర్ట్ అందుబాటులో ఉన్నా.. నియంత్రించలేకపోతున్నారు. ఇటీవల అడవుల్లో కళ్లెదుటే కార్చిచ్చుకు అగ్నికీలలు ఎగసిపడుతున్నా.. అటవీశాఖలో సిబ్బంది కొరత, నిధుల లేమితో నియంత్రించే నాథుడే లేడన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వన్యప్రాణుల్లో వణుకు

జిల్లాలో బుక్కపట్నం, కదిరి, పెనుకొండ,ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలో దాదాపు 1.24 లక్షల హెక్టార్లలో ఎత్తయిన కొండలతో చిట్టడవుల ప్రాంతం విస్తరించి ఉంది. ఉమ్మడి జిల్లా విభజన తరువాత శ్రీసత్యసాయి జిల్లాకే అత్యధికంగా అటవీ విస్తీర్ణం దక్కింది. విలువైన అటవీ వృక్ష జాతులు, వన్యప్రాణాలు వేల సంఖ్యలో ఉన్నాయి. ఈ ఏడాది తీవ్ర వర్షాభావంతో అటవీ వృక్షసంపద ఎండిపోతోంది. మానవ అవసరాలతోపాటు కొందరు నిప్పు పెడుతుండడంతో అటవీ సంపద, వన్యప్రాణులకు ముప్పు ఏర్పడింది. వేసవి వచ్చిందంటే చాలు వన్యప్రాణులకు దడ పట్టుకుని జనవాసాల్లోకి వచ్చేస్తున్నాయి. పెంపుడు జంతువులు, జనంపై దాడి చేస్తున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో సైతం ప్రాణాలు కోల్పోతున్నాయి.

నిధులేవీ?

జిల్లాలో అటవీశాఖ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగున్నరేళ్లుగా నిధులు కేటాయించింది లేదు. ఈ నేపథ్యంలో అటవీ సంరక్షణ చర్యలు ఎలా చేపట్టాలని ఆ శాఖ వర్గాలు ప్రశ్నిస్తున్నారు. బుక్కపట్నం, కదిరి, పెనుకొండ అటవీశాఖ పరిధుల్లో వేసవిలో అటవీ సంరక్షణ, ఫైర్ నియంత్రణకు క్యాంపా కింద చేపట్టిన పనులకు రెండేళ్లుగా బిల్లులు అందలేదు. ఏటా ఫిబ్రవరి 15 నుంచి మార్చి 15లోగా అటవీ ప్రాంతంతోపాటు కొండల్లో అగ్ని రాజుకుంటున్నట్లు అటవీ శాఖ చెబుతోంది. కేంద్రం ఐఎఫ్ఎం, రాష్ట్ర ప్రభుత్వం క్యాంపా నిధులు ఇవ్వడం మరిచాయి. వేసవి వస్తున్నా.. పైసా నిధులివ్వకపోవడంతో జిల్లాలోని అన్ని రేంజ్‌ల పరిధిలో అటవీశాఖ ఫైర్‌లైన్స్ పనులే మొదలుకాని దుస్థితి నెలకొంది. ఇటీవల క్షేత్రస్థాయిలో అటవీ శాఖ పర్యవేక్షణ కొరవడడంతో పచ్చని చెట్లకు నిర్దాక్షిణ్యంగా నిప్పుపెడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. గతేడాది పెనుకొండ, సోమందేపల్లి, మడకశిర, చిలమత్తూరు ఎర్రకొండ, చలివెందుల, చంద్రాయునిపల్లి, బుచ్చయ్యగారిపల్లి, ఎద్దులకొండ, నల్లకొండ, కర్నాటక నాగేపల్లి కొండలతోపాటు అటవీ ప్రాంతంలో కార్చిచ్చుతో వనసంపదతోపాటు వేలాది వన్యప్రాణులు మృత్యువాత పడ్డాయి. ఈఏడాది ఫిబ్రవరి మొదటి వారంలోనే జిల్లా కేంద్రం సమీపంలోని బుక్కపట్నం, అమగొంగపాళ్యం, జానకంపల్లి మల్లప్ప కొండల్లో మంగాపురం, సిద్ధరాపురం, గౌనివారిపల్లి కొండలు అగ్ని బారిన పడ్డాయి. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో వృక్ష సంపదతోపాటు వన్యప్రాణులు కనుమరుగయ్యే ప్రమాదముందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గౌనివారిపల్లి అటవీ ప్రాంతంలో చెలరేగిన మంటలు

అటవీ సంరక్షణ చర్యలు చేపడతాం

జిల్లాలో అటవీ సంపదతోపాటు వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. అన్ని అటవీ రేంజ్‌ల పరిధిలో అగ్ని నిరోధక రేఖలను ఏర్పాటు చేస్తున్నాం. అత్యధికంగా అటవీ ప్రాంతం చిట్టడవులతో విస్తరించి, గడ్డితో నిండి ఉంది. నిధుల కొరత ఉన్న మాట వాస్తవమే. అయినా వేసవిలో అడవి అగ్నిబారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అటవీ ప్రాంతంలో నిప్పుపడినట్లు సమాచారం వచ్చిన వెంటనే సిబ్బంది వెళ్లి మంటలను నియంత్రిస్తారు. అటవీ సంపద పరిరక్షణలో సరిసర గ్రామాల ప్రజలు తమ వంతు బాధ్యత వహించాలి.

- రవీంద్రనాథ్ రెడ్డి, జిల్లా అటవీ అధికారి

శాటిలైట్ ఫైర్ అలర్ట్ సిస్టం ఉన్నా..

అటవీ సంపద, వన్యప్రాణులపై ప్రజలకు అక్కడక్కడ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. కొందరి స్వార్థం వల్ల అడవికి నిప్పు పెడుతున్నారు. దీంతో అటవీ వృక్షజాతులతోపాటు వేలాది వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయి. వేసవిలో అగ్ని నుంచి వన్యసంపదను రక్షించుకునేందుకు (ఏపీఎఫ్ఎంఐఎస్) శాటిలైట్ ద్వారా ఫైర్ అలర్ట్ సిస్టం కొన్నేళ్ల కిందటే అందుబాటులోకి వచ్చింది. అటవీ ప్రాంతాల్లో అగ్నికీలలను గుర్తించి ఆయా రేంజ్‌ల అధికారులకు క్షణాల్లో సమాచారం ఇస్తుంది. ఇది అందుబాటులో ఉన్నా కార్చిచ్చును నియంత్రించలేకపోతున్నారు. జిల్లాలో అత్యధికంగా గడ్డితో నిండిన అటవీ ప్రాంతం ఉంది. దీంతో ఎక్కడైనా అగ్ని రాజుకుంటే అత్యంత వేగంగా వ్యాపించి, అడవి కాలిబూడిదైపోతోంది. అడవులను అగ్ని నుంచి సంరక్షించే బృందాలు జిల్లాలో లేకపోవడంతో అటవీ సిబ్బంది పైనే ఆధారపడాల్సి వస్తోంది. అసిస్టెంట్ బీట్ అధికారుల కొరత కారణంగా విశాలమైన అటవీ ప్రాంతాల్లో పర్యవేక్షణ అటకెక్కింది. అటవీ సరిసర గ్రామాల్లో వన సంరక్షణ సమితులున్నా నామమాత్రమేనన్న విమర్శలున్నాయి. వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీ శాఖ నీటి తొట్టెలు, రహదారుల్లో హెచ్చరిక బోర్డులు కూడా పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదు. అటవీ ప్రాంతాలు అగ్ని బారిన పడకుండా చేపట్టాల్సిన చర్యలపై ఇటీవల అవగాహన కల్పిస్తున్నట్లు అటవీశాఖ చెబుతున్నా.. అందులో విఫలమైందన్న వాదనలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

ఎన్నికల నిబంధనలు తప్పక పాటిస్తాం

రాజకీయ పార్టీలు సహకరించాలి

కలెక్టర్ అరుణ్‌బాబు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి, మార్చి 5: ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పక పాటిస్తామనీ, ఆ మేరకే ఎన్నికలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఒక్క పోలింగ్ కేంద్రం పరిధిలో 1500 మంది ఓట్లు దాటితే అనుబంధంగా మరొకటి ఏర్పాటు చేస్తామన్నారు. రాజకీయ పార్టీల నాయకులు సలహాలు, సూచనలు ఇస్తే వాటిని తప్పక పరిశీలిస్తామన్నారు. నియోజకవర్గస్థాయి సమావేశాల్లో కూడా రాజకీయ పార్టీలు భాగస్వామ్యం కావాలని కోరారు. జిల్లావ్యాప్తంగా 1561 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఏర్పాట్లు కూడా చాలావరకు పూర్తి చేశామన్నారు. సమావేశంలో జేసీ అభిషేక్ కుమార్, సబ్ కలెక్టర్ అపూర్వభరత్, డీఆర్‌ఓ కొండయ్య, నియోజకవర్గ ఎన్నికల అధికారులు భాగ్యరేఖ, వంశీకృష్ణ, గౌరీశంకర్, టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సొంత పార్టీవారి పనేనా?

కలకలం రేపిన ఫ్లెక్సీల చించివేత

వైసీపీ పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త ఇంటి వద్దే విధ్వంసం

హిందూపురం, మార్చి 5: పట్టణంలోని మారుతి లేఔట్‌లోని వైసీపీ పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త శాంత ఇంటి వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని దుండగులు మంగళవారం చించివేసి, వాటిని ఏర్పాటు చేసిన ఇనుప ఆంగ్లర్లను ధ్వంసం చేశారు. ఈ ఘటన పట్టణంలో కలకలం రేపింది. మారుతి లేఔట్ చివరి వైపున శాంత నివాసం ఉంటున్నారు. ఇంటివద్దే కొన్నిరోజుల క్రితం వైసీపీ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం శాంత పుట్టపర్తి వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చి చూసేసరికి ఇంటివద్ద ఉన్న ఫ్లెక్సీలను చించేసి, ఇనుప కడ్డీలను ధ్వంసం చేశారు. దీనిని చూసి శాంత నివ్వెరపోయారు. దీనిపై ఆమె మాట్లాడుతూ.. తనకు శత్రువులు ఎవరూ లేరనీ, ఎవరు చేశారో అర్థం కావడంలేదన్నారు. ఇటీవలిగా అధికార పార్టీలో శాంత, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ దీపిక వర్గాలు అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తనకు గిట్టనివారు చేసి ఉంటారని శాంత తన వర్గీయులతో ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. మరోవర్గం సింపతీ కోసం ఆమే చేయించి ఉండవచ్చని భావిస్తున్నారు. ఏది ఏమైనా పట్టపగలే వైసీపీ పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త ఇంటి ముందున్న ఫ్లెక్సీలను చించారంటే పట్టణంలో పోలీసు నిఘా ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.



శాంత ఇంటి ముందు ఫ్లెక్సీలు చించేసిన దృశ్యం

మిత్రద్రోహం..!

- ఆరోగ్య మిత్రలపై బదిలీ కత్తి
- దూరప్రాంతాలకు పంపే యోచన
- పొమ్మనకుండా.. పొగబెట్టే కుతంత్రం?
- ఇస్తున్నది చాలీచాలని వేతనం.. దూరప్రాంతాలకు వెళ్లేదెలా?
- ఆందోళనలో ఆరోగ్యమిత్రలు

ధర్మవరం, మార్చి 5: చిరుద్యోగులపై ప్రభుత్వం బదిలీ కత్తి పెట్టింది. ఆరోగ్యమిత్రలకే ద్రోహం చేసేందుకు పూనుకుంది. ఇప్పటికే జిల్లాలోని ఆరోగ్యమిత్రల వివరాలు కూడా ప్రభుత్వం సేకరించింది. బదిలీ పేరుతో దూరప్రాంతాలకు పంపే దిశగా చర్యలు చేపడుతున్నట్లు ఆరోగ్యమిత్రలు పేర్కొంటున్నారు. చాలీచాలని వేతనంతో దూరప్రాంతాలకు వెళ్లి ఎలా పనిచేయగలమని వాపోతున్నారు. ప్రభుత్వ నిర్ణయం పొమ్మనకుండా పొగబెట్టడమేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం బదిలీలు చేపడితే ఏళ్లుగా చాలీచాలని వేతనంతో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలు రోడ్డున పడనున్నారు.

నిర్వీర్యం చేసే దిశగా..

ఆరోగ్యశ్రీ పథకాన్ని మెరుగ్గా అమలు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం.. క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా రోజుకో నిర్ణయం తీసుకుంటోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)ల్లో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలను నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో మిత్రలుగా మార్పు చేశారు. ఇప్పుడు మళ్లీ వారిని దూరప్రాంతాలకు బదిలీ చేయనున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే 17 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారనుంది. అరకొర వేతనాలతో నెట్టుకొస్తున్న తమను దూరప్రాంతాలకు బదిలీ చేయడం ఏంటని ఆరోగ్యమిత్రలు వాపోతున్నారు. తక్కువ వేతనంతో దూరప్రాంతాలకు వెళ్లి పనిచేయడం ఎలాగన్న అయోమయంలో పడ్డారు. చిరుద్యోగులపై బదిలీ ప్రయోగాలు చేయడం ఏంటని వారు రగిలిపోతున్నారు. ఆరోగ్యమిత్రలను బదిలీ చేస్తే పథకం నిర్వీర్యమయ్యే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.



ఆరోగ్యశ్రీ చాంబర్ (ఫైల్)

17 ఏళ్లుగా చాలీచాలని వేతనాలే..

ఉమ్మడి అనంత జిల్లాలో పీహెచ్‌సీ, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు, ఏరియా ఆస్పత్రులు, అర్బన్ హెల్త్‌సెంటర్లలో 200 మంది వరకూ ఆరోగ్యమిత్రలు పనిచేస్తున్నారు. వీరు 17 ఏళ్లుగా అరకొర వేతనాలతో నెట్టుకొస్తున్నారు. వారికి ఇచ్చే వేతనంలో కోతలు మినహాయించుకుంటే చేతికి అందేది రూ.13,500 మాత్రమే. ఈ వేతనంతో ప్రస్తుతం ఇల్లు గడవడమే కష్టంగా ఉందని వారు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో తమను దూరప్రాంతాలకు బదిలీ చేస్తే.. అక్కడికెళ్లి ఎలా పనిచేయగలమని వారు వాపోతున్నారు. టీఏ, డీఏ సదుపాయాలు కూడా లేవని వారు చెబుతున్నారు. చిరుద్యోగులమైన తమను ఇలా వేధించడం ఎంతవరకు సమంజసమని వారు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బదిలీ నిర్ణయాన్ని విరమించుకుని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆరోగ్యమిత్రలు కోరుతున్నారు.

బదిలీలపై స్పష్టత లేదు..

ప్రభుత్వం పీహెచ్‌సీ, నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రల వివరాలను సేకరించింది. గతంలో ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఆరోగ్యమిత్రలు తమ సమీప ప్రాంతాలకు బదిలీ చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఆ మేరకు ప్రభుత్వం మిత్రల వివరాలను సేకరించి ఉండవచ్చు. బదిలీపై స్పష్టత లేదు.

- శ్రీదేవి, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్

ప్రమాణం చేస్తేనే.. పని చేస్తా..!

- వైసీపీ సేవలో కదిరి అధికార యంత్రాంగం
- మత గ్రంథంతో ఓ అధికారి ప్రచారం
- అధికార పార్టీకి ఓటేస్తానని దేవుడిపై ప్రమాణం చేయాలని ఒత్తిళ్లు
- చేస్తేనే పని చేసిపెడుతున్న వైనం
- వచ్చీరాగానే వైసీపీ ఇన్‌చార్జిని కలిసిన మున్సిపల్ కమిషనర్, సీఐ
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు

ఆయన కదిరి మున్సిపాలిటీలోని ఓ కీలక విభాగానికి అధికారి. ఏడాది క్రితం ఇక్కడికి బదిలీపై వచ్చాడు. ఇటీవల వరకు మామూలుగానే ఉన్నాడు. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో తన నిజస్వరూపాన్ని బయటపెట్టాడు. ఎన్నికల్లో అధికార పార్టీ గెలుపు కోసం తన అధికారాలను పావుగా వాడుకుంటున్నాడు. పనుల మీద కార్యాలయంలో ఆయన వద్దకొచ్చినా.. ఆయనే ఫీల్డ్‌కు వెళ్లినా వైసీపీ ప్రచారం చేస్తున్నాడు. మత గ్రంథాన్ని దగ్గర పెట్టుకుని, తాను నమ్మిన దేవుని సాక్షిగా జగన్‌కే ఓటేస్తామని చెప్పాలని బలవంత పెడుతున్నట్లు సమాచారం. వారు ప్రమాణం చేసిన తరువాతే వారికి పని చేసిపెడుతున్నట్లు సర్వత్రా చర్చించుకుంటున్నారు. ఈ అధికారి ఎన్నికల్లో ఎంతగా అధికార పార్టీ కోసం పనిచేస్తారోనన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తక్షణం బదిలీ చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

కదిరి, మార్చి 5

ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో కదిరిలో అధికారులు.. అధికార పార్టీ సేవలో తరిస్తున్నారు. అధికార పార్టీ కోసమే వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. సాధారణంగా బదిలీపై వచ్చిన అధికారులు ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేనో, మున్సిపల్ చైర్మన్‌నో కలుస్తారు. ప్రస్తుతం కదిరికి వచ్చిన అధికారులు మాత్రం సరాసరి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మగ్బూల్‌ను కలిశారు. బొకేలు ఇచ్చి, స్వామిభక్తి చాటుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఆయననే ముఖ్య అతిథిగా పిలుస్తున్నారు. ఆయన ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నారు కూడా. ప్రొటోకాల్‌కు తిలోదకాలిచ్చారు. ఇప్పటికే ఇక్కడ పనిచేస్తున్న అధికారులు కూడా ఎన్నికలు దగ్గర పడేకొద్దీ నిజస్వరూపాన్ని బయట పెడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు తిరిగి ఇక్కడికే వచ్చేలా ప్రణాళిక రచించినట్లు తెలిసింది.

వైసీపీ కోసమే వచ్చారా?

రానున్న ఎన్నికల్లో వైసీపీ కోసం పనిచేయడానికి వచ్చారా అన్నవిధంగా కొత్తగా వచ్చిన కొంతమంది అధికారులు వ్యవహరిస్తున్నట్లుతెలుస్తోంది. మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ ఇటీవల బదిలీపై కదిరికి వచ్చారు. వచ్చీరాగానే వైసీపీ ఇన్‌చార్జి మగ్బూల్‌ను కలిసారు.



కదిరి వైసీపీ సమన్వయకర్త మక్బూల్‌ను కలిసిన కమిషనర్

ఆయన తీరుతో పట్టణ ప్రజలు విస్తు పోయారు. మున్సిపల్ కమిషనర్ ఒక పార్టీ ఇన్‌చార్జిని కలిస్తే మిగతా ఉద్యోగులకు ఏం సందేశం ఇచ్చినట్లు అని చర్చించుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో కూడా ఆయనకు పెద్ద పీట వేసి, కమిషనర్ సైతం నిలబడుకోవడం గమనార్హం. పట్టణ సీఐ పుల్లయ్య కదిరికి బదిలీపై వస్తూనే వైసీపీ ఇన్‌చార్జిని కలిశారు. ఇది చర్చనీయాంశమైంది. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అధికారులు, ఇలా ఓ పార్టీ ఇన్‌చార్జిని కలవడం ఏమిటని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇలా నియోజకవర్గంలో పలువురు ప్రధానాధికారులు.. వైసీపీకి వత్తాసు పలుకుతుంటే తామెలా పనిచేయగలమని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. ఈ తంతు పబ్లిక్‌గానే సాగుతున్నా.. జిల్లా ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు.

ఆ అధికారులు.. ఆ పక్షమేనా?

ఇటీవల కొంతమంది అధికారులు కదిరి నియోజకవర్గానికి బదిలీపై వచ్చారు. మరికొంతమంది ఎన్నికలు దగ్గరపడేకొద్దీ ఇక్కడే ఉండి స్వామిభక్తి చాటుకుంటున్నట్లు సమాచారం. ఇక్కడ రెవెన్యూ కార్యాలయంలో పనిచేసి, డిమోషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లి, మళ్లీ ఉద్యోగోన్నతి పొంది, కదిరికే ఆ అధికారి బదిలీపై వచ్చాడు. ఆ అధికారి గతంలో ఇక్కడ అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నాడు. అయినా ఆయనను ఇక్కడికే బదిలీ చేయడం వెనుక రహస్యమేమిటని ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. పలు భూ కుంభకోణాలకు పాల్పడి, జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులతో కూడా చీవాట్లు తిన్నట్లు సమాచారం. అటువంటి వ్యక్తిని కీలకమైన ఓ విభాగానికి బదిలీ చేశారు. ఆయన బదిలీపై వచ్చారా.. ఇక్కడున్న అధికార పక్షనాయకులు వేయించుకున్నారా అని టీడీపీ నాయకులు సందేహపడుతున్నారు. ఎన్నికల్లో ఏకపక్షంగా వ్యవహరించడానికే ఇక్కడికి ఆయను బదిలీ చేయించుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణ పోలీసు స్టేషన్‌లో ఓ కానిస్టేబుల్ గతంలో జరిగిన ఘర్షణ కేసులో నిందితుడు. ఇప్పటికీ ఇక్కడే పనిచేస్తున్నాడు. ఆ కానిస్టేబుల్ ఎప్పుడూ యునిఫాం కూడా వేసుకోడనీ, సివిల్ డ్రెస్‌లోనే తిరుగుతుంటాడని సమాచారం. వచ్చిన అధికారులతో లాబీయింగ్ చేయడమే అతడి పని అని పలువురు చెబుతున్నారు. అయినా ఆ కానిస్టేబుల్‌ను ఇక్కడే ఉంచడం వెనుక ఆంతర్యమేమటని పట్టణ వాసులు ప్రశ్నిస్తున్నారు. రెండు పార్టీల మధ్య తలెత్తిన ఘర్షణలో నిందితుడైన కానిస్టేబుల్‌ను బదిలీ చేయకపోతే అధికార పార్టీకే కొమ్ముకాసే అవకాశం ఉందని చర్చించుకుంటున్నారు. తక్షణం వారిని బదిలీ చేయాలని కోరుతున్నారు. అప్పుడే నిష్పాక్షిక ఎన్నికలు సాధ్యమని అభిప్రాయపడుతున్నారు.

నేడు వైద్యకళాశాల స్నాతకోత్సవం

అనంతపురం టౌన్, మార్చి 5: అనంతపురం వైద్యకళాశాల 19వ స్నాతకోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు తెలిపారు. 2018-19 విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్‌లో చేరి, కోర్సు పూర్తి చేసుకున్న వంద మందికి డాక్టర్ పట్టాలు అందించి అభినందిస్తామని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో బుధవారం సాయంత్రం వేడుకలను నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ గౌతమి, వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ వీసీ డాక్టర్ రఘునందన్ తదితరులు హాజరవుతారని ప్రిన్సిపాల్ తెలిపారు

నిరుద్యోగులకు డ్రైవింగ్‌లో శిక్షణ, ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 5: నిరుద్యోగ యువతకు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించేందుకు ఈనెల 11 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. 45 రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణకు 19-35 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న... 8వ తరగతి పూర్తయిన యువకులు అర్హులన్నారు. కంప్యూటర్ డ్రైవింగ్ సిమ్యులేటర్ ద్వారా బేసిక్ డ్రైవింగ్ నైపుణ్య శిక్షణ, ఆర్టీఓ అధికారుల సహకారంతో డ్రైవింగ్ పరీక్షలు, లైసెన్సు ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్, ఉపాధి కల్పిస్తామన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 83097 57739, 99594 22884ను సంప్రదించాలని కోరారు.

గురుకులాల్లో ప్రవేశానికి పరీక్షలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 5: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 10న ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అంబేడ్కర్ గురుకుల పాఠశాలల ఉమ్మడి అనంత జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి విద్యార్థులకు 10వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రానికి 30 నిమిషాలు ముందుగా చేరుకోవాలన్నారు. హాల్ టికెట్‌లో విద్యార్థుల ఫొటో తప్పుగా ఉంటే... ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డుతో పరీక్షా కేంద్రానికి హాజరుకావాలన్నారు.

ఖరీఫ్ పంట నష్టపరిహారం నేడు విడుదల

అనంతపురం అర్బన్, మార్చి 5: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు ఆఫీస్ నుంచి ఖరీఫ్-2023 పంటనష్టపరిహారాన్ని బుధవారం విడుదల చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 1,79,815 హెక్టార్లల్లో సాగు చేసిన 1,69,970 మంది రైతులు రూ.251.2 కోట్ల విలువైన పంటను నష్టపోయారని, ఆ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేస్తారని తెలిపారు.

డీసీహెచ్ఎస్ పోస్టులకు నేడు కౌన్సెలింగ్

అనంతపురం టౌన్, మార్చి 5: వైద్యవిధానశాఖలో వైద్యపోస్టులకు ఎంపికైన అభ్యర్థుల రెండో జాబితా విడుదల చేసినట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. మొత్తం 26 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసి ఆ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. వారికి బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు కేటాయిస్తామన్నారు. తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు డీసీహెచ్ఎస్ కార్యాలయంలో హాజరుకావాలన్నారు.

ఏపీఎంఐపీ పీడీగా రఘునాథ్‌రెడ్డి

అనంతపురం అర్బన్, మార్చి 5: ఏపీఎంఐపీ పీడీగా రఘునాథ్‌రెడ్డిని నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యానశాఖ ఏడీ రఘునాథ్‌రెడ్డి ఇదివరకు జిల్లా ఉద్యానశాఖ ఇన్‌చార్జి అధికారిగా విధులు నిర్వహించేవారు. ఈ నేపథ్యంలో ఉద్యోగోన్నతిపై ఏపీఎంఐపీ పీడీగా ఆయన్ను నియమించారు. ఇదివరకు ఏపీఎంఐపీ ఇన్‌చార్జి పీడీగా పనిచేసిన ఫిరోజ్ ఖాన్ ఇక్కడే ఏపీడీగా కొనసాగనున్నారు. ఇక్కడ ఏపీడీ ఫజలున్నీసా బేగంను చిత్తూరు ఏపీఎంఐపీ ఏపీడీగా బదిలీ చేశారు.

నిరుద్యోగులకు కంప్యూటర్ శిక్షణ, ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 5: నిరుద్యోగ యువతీ, యువకులకు కంప్యూటర్ టెక్నాలజీపై ఉచిత శిక్షణ, ఉపాధి కల్పిస్తున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. 60 రోజుల పాటు బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, బేసిక్ ట్యాలీ, లైఫ్ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్, బేసిక్ స్పోకెన్ ఇంగ్లీష్, కస్టమర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ కోర్సులలో నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణ కల్పిస్తామన్నారు. 20-35 సంవత్సరాలు వయస్సు కలిగి ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్ చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్, ఉపాధి కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 73969 50345, 77807 52418ను సంప్రదించాలన్నారు.

టీటీసీ ఫలితాలు విడుదల

అనంతపురం విద్య, మార్చి 5: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (టీటీసీ) కోర్సు పరీక్షలు 2023 ఫలితాలు విడుదలయ్యాయని డీఈఓ వరలక్ష్మి, ఏసీ గోవింద్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను గత ఏడాది డిసెంబరు 17న నిర్వహించామని, అభ్యర్థులు తమ ఫలితాలను www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందవచ్చని అన్నారు. అభ్యర్థుల ఉత్తీర్ణత సర్టిఫికెట్లు అనంతపురం డీఈఓ ఆఫీస్‌కు కాగానే సమాచారం ఇస్తామన్నారు.

8న జిల్లా మ్యూజియం ప్రారంభోత్సవం

అనంతపురం కల్చరల్, మార్చి 5: స్థానిక ఆదిమూర్తి నగర్‌లో కొత్తగా నిర్మించిన పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు మ్యూజియంను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా శుక్రవారం ప్రారంభిస్తారని ఆ శాఖ ఏడీ రజిత ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు నుంచే మ్యూజియంలో సందర్శనకు పురావస్తు ప్రదర్శన నిర్వహిస్తామన్నారు.

ఫీల్డు అసిస్టెంట్ మృతి

నల్లమాడ, మార్చి 5: మండలంలోని వేళ్లమద్ది గ్రామానికి చెందిన ఫీల్డు అసిస్టెంట్ నీలకంఠ(25) మంగళవారం మృతిచెందారు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు నీలకంఠ ఉపాధి పనులవద్దకెళ్లి, పనులు ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. నీరు తాగి అస్వస్థతతో ఇంట్లో సొమ్మసిల్లి పడిపోయారు. గ్రామస్థులు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడికి భార్యతోపాటు మూడునెలల చిన్నారి ఉన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.18 వేలు

అనంతపురంరూరల్, మార్చి 5: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18 వేలు, కనిష్ఠంగా రూ.9 వేలు, సరాసరి రూ.14 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 171 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నత్తకు నడక నేర్పేలా..!

ఏళ్లు గడుస్తున్నా ముందుకుసాగని జాతీయ రహదారుల పనులు

- ఇప్పటికీ కొన్ని చోట్ల ప్రారంభ దశలోనే..
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే దుస్థితి
- అవస్థల నడుమ ప్రయాణాలు



రాప్తాడు ఆర్ఓబీ పనుల దుస్థితి

అనంతపురం సిటీ, మార్చి 5: ఉమ్మడి జిల్లాలో ఏళ్లు గడుస్తున్నా జాతీయ రహదారుల పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. భూసేకరణ ప్రక్రియలో అధికారుల అలసత్వం కారణంగా కొన్ని చోట్ల ఇంకా ప్రారంభదశలోనే ఉన్నాయి. ఏళ్ల తరబడి నత్తనడక పనులు సాగుతుంటే.. ఇంకెన్నాళ్లు ఈ అవస్థలు అంటూ ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్లు గడిచినా ముందుకు సాగని పనులు..

కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జాతీయ రహదారుల నిర్మాణాలకు నిధులు కేటాయించి సుమారు మూడేళ్లు కావస్తున్నా.. ఎక్కడా ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదు. పోనీ రూ. కోట్లలో బిల్లులు పెండింగ్ ఉన్నాయా అని.. అడిగితే.. ఆశాఖ అధికారులు కొద్దిగా మాత్రమే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని చెబుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు చాలా వరకు చేసిన పనులకు బిల్లులు జాప్యం కావడంతోనే పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదని కొందరు కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా.. రాప్తాడు, కదిరి, ముదిగుబ్బ- పుట్టపర్తి, కదిరి-గోరంట్ల, పుట్టపర్తి -కోడూరు రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉంది. గుత్తి- గుంతకల్లు- బళ్లారివైపు జాతీయ రహదారి పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో అక్కడ ఇబ్బందుల నడుమ ప్రయాణం చేయాల్సిన దుస్థితి. త్వరలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో ఈ పనులు జరుగుతాయో..? లేదో కూడా తెలియని పరిస్థితి.

ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న కొన్ని పనుల వివరాలు, జరిగిన శాతం ఇలా..

పనుల పేరు	దూరం (కి.మీ)	నిధులు	శాతం
కదిరి బైపాస్	13 కి.మీలు	రూ. 221 కోట్లు	85
ముదిగుబ్బ బైపాస్	8	రూ. 117 కోట్లు	90
రాప్తాడు ఆర్ఓబీ	1.6	రూ. 98.55 కోట్లు	97
హిందూపురం- పరిగి రోడ్డు	20	రూ. 98 కోట్లు	85
కదిరి ఆర్ఓబీ 48ఈసీ	2.1	రూ. 69 కోట్లు	95
కదిరి 45సి	1.2	రూ. 60 కోట్లు	85
బత్తలపల్లి- ముదిగుబ్బ ఫోర్‌లేన్	33	రూ. 536 కోట్లు	65
ముదిగుబ్బ- పుట్టపర్తి రోడ్డు	32	రూ. 402 కోట్లు	50
పులివెందల-బి కొత్తపల్లి	57	రూ. 840 కోట్లు	16
కదిరి- గోరంట్ల పుట్టపర్తి - కోడూరు	47	రూ. 1319 కోట్లు	10

రూ. 65 కోట్లతో కదిరి- కుటాగుళ్ల ఆర్ఓబీ 1.7 కి.మీ : భూ సేకరణ స్థాయిలో
రూ. 160 కోట్లతో తాడిపత్రి బైపాస్ 6.5 కి.మీ : భూసేకరణ స్థాయిలో
రూ. 810 కోట్లతో గోరంట్ల- హిందూపురం ఫోర్‌లేన్ 34 కి.మీ : టెండర్ స్థాయి

భూ సేకరణలో జాప్యం...

ఉమ్మడి జిల్లాలోని కదిరి- కుటాగుళ్ల (ఆర్ఓబీ) రోడ్డు 1.7 కిలోమీటర్లకు కేంద్రం రూ.65 కోట్లు నిధులు కేటాయించింది. తాడిపత్రి బైపాస్ పనులు 6.5 కిలో మీటర్లకు రూ. 160 కోట్లు కేటాయించింది. అయితే ఈ రెండు పనులకు సంబంధిత శాఖల అధికారులు భూ సేకరణ చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. కాగా గోరంట్ల - హిందూపురం (ఫోర్‌లేన్) రోడ్డు 34 కిలోమీటర్లకు సంబంధించి రూ. 810 కోట్లతో టెండర్ ప్రక్రియ నిర్వహించాల్సి ఉందని ఆశాఖ అధికారుల సమాచారం.

వేగంగా జరిగేలా చూస్తాం: మురళీమోహన్, ఎన్‌హెచ్ ఎస్ఈ

ఉమ్మడి జిల్లాలో చాలా పనులు జరుగుతున్నాయి. ఎక్కడికక్కడ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని ఆయా కాంట్రాక్టర్లకు సూచిస్తున్నాం. బిల్లులు కూడా కొంత వరకు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. చాలా వరకు క్లియర్ అయ్యాయి. చివరి దశలో ఉన్న పనులపై దృష్టి సారించి త్వరగా పూర్తి చేసే విధంగా చూస్తాం. మిగిలిన పనులను కూడా వేగంగా జరిగేలా చూస్తాం.



ముదిగుబ్బ బైపాస్ రోడ్డు

వడదెబ్బతో మహిళ మృతి

రేషన్ కోసం వెళ్లి తిరిగిరాని లోకాలకు



మృతిచెందిన చాకలి వెంకమ్మ

హిందూపురం, మార్చి 5 : పట్టణ పరిధిలోని ఎస్ సడ్లపల్లిలో రేషన్ బియ్యం కోసం క్యూలో నిలబడిని చాకలి వెంకమ్మ(67) అనే మహిళ వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు స్థానికులు, బంధువులు తెలిపారు. ఇంటిం టికీ వెళ్లి వాహనం ద్వారా రేషన్ బియ్యం అందజేస్తారని ప్రభుత్వం, పాలకు లు గొప్పలు చెబుతుంటారు. కానీ పట్టణ పరిధిలోని ఎస్ సడ్లపల్లి షాపు నంబరు 29లో డీలర్ తన అనుచరుల ద్వారా కార్డుదారులకు ఇంటివద్దే రేషన్ బియ్యం అందజేస్తున్నాడు. చాకలి వెంకమ్మ అనే మహిళ బియ్యం కోసం ఆ రేషన్ షాపు వద్ద బియ్యం కోసం క్యూలో నిలబండింది. అయితే మంగళవారం ఎండ ఎక్కువగా ఉండటంతో వడదెబ్బ తగిలి అక్కడికక్కడే కుప్పకూలింది. ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గ్రామస్థులు మాట్లాడుతూ డీలర్ నిర్లక్ష్యం వల్లే ఆమె వడదెబ్బ తగిలి మృతిచెందిందని, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.



డీలర్ ఇంటి వద్ద రేషన్ పంపిణీ

బీటీపీ కాలువ సకాలంలో పూర్తి చేస్తా

టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మార్చి 5: నియోజకవర్గ ప్రజలకు జీవనాడి అయిన భైరవాన్‌తిప్ప బ్రాంచ్ కెనాల్ పనులను సకాలం పూర్తి చేస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు అన్నారు. ఈ కాలువను పూర్తి చేస్తే 114 చెరువులకు నీరు అందిం చవచ్చునని అన్నారు. తాగు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కా రం కోసం కాలువ పనులను సకాలంలో పూర్తి చేసేందుకు శాయ శక్తులా కృషి చేస్తానని ఆయన అన్నారు. శెట్టూరులో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళ్యాణదుర్గం నియోజకవర్గం చాలా వెనుకబడ్డ ప్రాంతమని, రహదారులు అధ్వానంగా ఉన్నాయని అన్నారు. ఇక్కడ ఎలాంటి అభివృద్ధి లేదని, మౌళిక సదుపాయాలు లేవని అన్నారు. టెక్స్‌టైల్ పరిశ్రమ ఒకటి ప్రతిపాదనలో ఉందంటున్నారని, రఘువీరారెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు ఏపీఐఐసీ ద్వారా సుమారు వెయ్యి ఎకరాల భూమిని సేకరించినట్లు తెలిసిందని అన్నారు. ఆ పరిశ్రమను తీసుకువచ్చేందుకు తప్పకుండా కృషి చేస్తానని అన్నారు. రహదారులు, పాఠశాలలు, ఆస్పత్రుల ఏర్పాటుకు తప్పకుండా కృషి చేస్తానని అన్నారు. 'మీలో ఒక్కడిగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తాను' అని ఆయన అన్నారు. టీడీపీ కంచుకోటలో అత్యధిక మెజార్టీతో తన గెలిపించాలని కోరారు.

● నియోజకవర్గంలో బుధవారం నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలని అమిలినేని సురేంద్రబాబు పార్టీ నాయకులు, కార్యకర్తలను కోరారు. కళ్యాణదుర్గంలోని ప్రజావేదికలో వారి తో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎం.కొండాపురం, ముద్దినాయనపల్లి, ఎం.కొత్తూరులో నిజం గెలవాలి యాత్ర ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్ చౌదరి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లికార్జున, గొల్ల వెంకటేశులు, పాపంపల్లి రామాంజినేయులు, డీకే రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రసంగిస్తున్న సురేంద్రబాబు


'సూపర్ సిక్స్' పథకాలపై అవగాహన కల్పిస్తున్న కందికుంట యశోదమ్మ

మినీ మేనిఫెస్టోపై ఇంటింటి ప్రచారం

కదిరి, మార్చి 5: టీడీపీ మినీ మేనిఫెస్టోపై నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదమ్మ ఇంటింటి ప్రచారం చేపట్టారు. మంగళవారం పట్టణంలోని 7వ వార్డులో పర్యటించిన ఆమె 'సూపర్ సిక్స్' పథకాలపై అవగాహన కల్పించారు. టీడీపీ పథకాలతో రాష్ట్ర భవిష్యత్తుతోపాటు ప్రజల జీవితాలు కూడా బాగుపడతాయన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి, గెలిపించాలని కోరారు. ఆమెతోపాటు డైమండ్ ఇర్ఫాన్, అహ్మద్ అలీ, మనోజ్, రాఘవ, గంగాధర్, రవి, రేఫా, ఐటీడీపీ మన్సూర్, జునైద్, పీట్ల రమణమ్మ, గంగరత్నమ్మ, ఉమాదేవి, ప్రమీలమ్మ, జనసేన నాయకులు కిన్నెర మహేష్, రెడ్డిశేఖర్ కార్యకర్తలున్నారు.

నేడు ఈవీఎంలపై అవగాహన

నల్లచెరువు, మార్చి 5: ఎన్నికల నేపథ్యంలో బుధవారం కదిరి ఆర్డీవో కార్యాలయంలో ఈవీఎంలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీఓ ఆదేశాల మేరకు ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు ప్రారంభిస్తామన్నారు.

ధర్మవరంలో పోటీ చేసేది నేనే..

● టీడీపీ జెండా ఎగుర వేయడానికే వచ్చా
● నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్


రావులచెరువులో కరపత్రాలు అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరంరూరల్, మార్చి5: రానున్న ఎన్నికల్లో ధర్మవరం టీడీపీ అభ్యర్థిగా పోటీచేసేది తానేననీ, టీడీపీ జెండా ఎగురవేయడానికి వచ్చాననీ, ఎవరో చేప్పే గాలిమాటలు పట్టించుకోవద్దని నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు. బాబు సూపర్-6 కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని రావులచెరువు, యర్రగుంటపల్లి, తండా గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ముందుగా గ్రామానికి వచ్చిన శ్రీరామ్‌కు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. క్రేన్‌తో గజమాలలు వేసి, డప్పులు కొడుతూ, హారతులు పట్టి బాణసంచా కాలుస్తూ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీరామ్ ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ మహిళలు.. తాగునీటి సమస్య, మినరల్‌వాటర్‌ప్లాంట్ ఏర్పాటు, డబుల్ రోడ్డు వేయించాలని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై శ్రీరామ్ మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యే అయిన వెంటనే సమస్యలన్నీ పరిష్కరిస్తానన్నారు. తనను నాయకుడిగా చూడవద్దనీ, కుటుంబసభ్యుడిగా భావించాలన్నారు. టీడీపీని గెలిపిస్తే ఎల్లవేళలా అందరికీ అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా.. భవిష్యత్తు బాగుండాలన్నా మళ్లీ సీఎంగా చంద్రబాబు కావాలన్నారు. ధర్మవరంలో టీడీపీ జెండా ఎగురవేయడం ఖాయమని స్పష్టం చేశారు. జడ్పీ మాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, మాజీ ఎంపీపీ కుణుతూరు వేణుగోపాల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మేకల రామాంజనేయులు, కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, నాయకులు మహేష్‌చౌదరి, సర్పంచ్ ముత్యాలప్పనాయుడు, గొట్లూరు శ్రీనివాసులు, విజయ్‌సారథి, రాఘవరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.


గజమాలతో పరిటాల శ్రీరామ్‌కు సత్కారం

జనరల్ సెక్రటరీగా పర్వీన్ బాను



కదిరి, మార్చి 5: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ముస్లిం మైనార్టీ జనరల్ సెక్రటరీగా టీడీపీ నాయకురాలు పర్వీన్ బాను నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె... టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, కదిరి ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్‌కు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్నానన్నారు. రెండుమార్లు ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా, మహిళా విభాగం అధ్యక్షురాలిగా పనిచేసినట్లు తెలిపారు. మహిళ కార్యనిర్వాహకరాష్ట్ర కార్యదర్శిగా పనిచేసినట్లు తెలిపారు. 2024లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ముస్లిం మైనార్టీలకు టీడీపీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. దుల్హాన్ పథకంతో ఎంతో మంది ఆడబిడ్డలకు పెళ్లిళ్లు చేశామన్నారు. రంజాన్ తోఫా, ఇమామ్, షేక్‌లకు గౌరవ వేతనం, షాదీమహల్స్, విదేశీ విద్య లాంటి పథకాలు టీడీపీ ప్రవేశపెట్టిందన్నారు.

టీడీపీ నాయకులపై కేసు నమోదు

బత్తలపల్లి, మార్చి 5: మండల కేంద్రంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ వర్గీయుల మధ్య సోమవారం తలెత్తిన ఘర్షణకు సంబంధించి టీడీపీ నాయకులు గోనుగుంట్ల విజయ్‌కుమార్, గోనుగుంట్ల నారాయణరెడ్డి, కొండేటి అప్పస్వామి(గంటాపురం జగ్గు) మరికొంతమందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ముదిగుబ్బ మండలం సంకేపల్లికి చెందిన వెంగమనాయుడు ఫిర్యాదు మేరకు కేసు కట్టామన్నారు.

కొత్తచెరువు ఇన్‌చార్జి ఈఓగా సురేంద్రనాథ్ రెడ్డి

కొత్తచెరువు, మార్చి 5: మేజర్ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా సురేంద్రనాథ్ రెడ్డిని నియమించారు. ఈ మేరకు ఇన్‌చార్జి ఎంపీడీఓ సిద్దారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మేజర్ గ్రామ పంచాయతీ గ్రేడ్-1 ఈఓగా ఉన్న గోపాల్ ఈనెల 1 నుంచి 31వరకు సెలవుపై వెళ్లడంతో మైలసముద్రం గ్రామం గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శి కొత్తగాచెరువు పంచాయతీ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీడీఓ తెలిపారు. సురేంద్రనాథ్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపడతారని ఆయన తెలిపారు.

రైతు కుటుంబానికి నేతల పరామర్శ

తనకల్లు, మార్చి 5: మండలకేంద్రంలోని బుడిదగడ్డవీధికి చెందిన రైతు వెంకటరమణ సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో అతడి కుటుంబ సభ్యులను పలు పార్టీల నాయకులు మంగళవారం పరామర్శించారు. ఆర్థికసాయం అందజేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు హసనాపురం చంటి రైతు కుటుంబీకులను పరామర్శించి రూ.పదివేల ఆర్థిక సాయం అందించారు. బీజేపీ మండలాధ్యక్షుడు రాజన్న, మైనార్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బాబా ఫకృద్దీన్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఎస్సీ మోర్చా జిల్లా మాజీ కార్యదర్శి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు వేమనారాయణ, జానకీరాం, మల్లికార్జున, రమేష్ తదితరులున్నారు. యువ రైతు వెంకటరమణ కుటుంబానికి ప్రభుత్వం రూ.పదిలక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బడ్డా సుబ్బిరెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి శివన్న, రైతు సం ఘం జిల్లా కమిటీ సభ్యులు రమణ, సీఐటీ యూ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఒంటెద్దు వేమన్న తదితరులున్నారు.

టీడీపీ నాయకుల పరామర్శ

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రైతు కుటుంబీకులను టీడీపీ నాయకులు పీవీ పవన్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. తన వంతు సాయంగా రూ.20వేలు అందించారు. మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు దేశాయి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు మహబూబ్‌బాషా, జియావుల్లా, నారాయణస్వామి, రామచంద్ర, పిజీ మల్లికార్జున, హనుమంతు, శ్రీనివాసులు, ప్రసాద్, తోట కిషోర్, సరోజమ్మ, దస్తగిరి, ఫక్కీర్‌సాబ్, ఎస్‌బిఐ రెడ్డెప్ప, గూడిపల్లి రెడ్డెప్పరెడ్డి, నాయకులు, కార్యకర్తలున్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత

● జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి

పుట్టపర్తి రూరల్, మార్చి 5: అప్పుడే పుట్టిన చిన్నారి నుంచి 5 సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కలను తప్పక వేయించడం తల్లితండ్రుల బాధ్యత అని ్యతని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈనెల 3వ తేదీన పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించామని అందులో వేచించని వారికి ఇంటి వద్దకే వచ్చి వైద్యసిబ్బంది చుక్కలు వేస్తారన్నారు. మండలంలోని పెడబల్లి, జిల్లాకేంద్రంలోని గోకులం ప్రాంతంలో మంగళవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో మహమ్మారిని దేశం నుంచి తరిమికొట్టడం సాధ్యమన్నారు. పోలియో రహిత సమాజానికి వైద్యులతోపాటు అందరూ దోహదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు నగేష్, లలితకుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు వెంకటరమణ, చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పీ రాధ పాల్గొన్నారు.


సర్వేను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

పుట్టపర్తి రూరల్, మార్చి 5: ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ భాగ్యరేఖ మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, వీవీటీ, వీఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీమ్స్‌కు శిక్షణ ఇచ్చారు. పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు, నల్లమాడ, అమడగూరు, ఓబుళదేవరచెరువు, తహసీల్దార్లు వేణుగోపాల్, కళావతి, భారతి, నాగభూషణం, ఖాజాబీ, రమణారెడ్డి, డీఏఓ మనోజ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ సమావేశానికి తరలిరండి

కొత్తచెరువు, మార్చి 5: మండలంలో బుధవారం జరగనున్న పార్టీ సమావేశానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని మండల కన్వీనర్ అడపాల రామకృష్ణ మంగళవారం ప్రకటనలో కోరారు. మండల కేంద్రంలోని శ్రీవిద్య కల్యాణ మండపంలో ఉదయం 11గంటలకు సమావేశం నిర్వహిస్తా మన్నారు. సమావేశంలో రాబోయే ఎన్నికలలో అనుసరించాల్సిన విధానాలపై చర్చిస్తామని, ప్రతి కార్యకర్త, అభిమాని హాజరు కావాలని పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

ఎన్నికల విధులపై అవగాహన తప్పనిసరి: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, మార్చి 5: ఎన్నికల విధులు, విధివిధానాలపై పోలీసు సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎలక్షన్ సెల్ పోలీసుసిబ్బందికి సార్వత్రిక ఎన్నికల్లో పోలీసులు పాటించాల్సిన విధివిధానాలపై చేపట్టాల్సిన విధులపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసే వరకు పోలీసులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఎన్నికల్లో అక్రమాలకు అడ్డుకట్ట, శాంతిభద్రతల పరిరక్షణ అంశాలపై దృష్టి సారించాలన్నారు. ఎన్నికల్లో సమర్థవంతంగా పనిచేసి సమాచారం పక్కాగా సేకరించే విధంగా సిబ్బంది కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, దిశా సీఐ విక్రమ్, ఎస్పీ ఎస్సై ప్రదీప్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

పుట్టపర్తి, మార్చి 5 : జిల్లాకేంద్రంలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తి తీర్చడానికి గోకులం, సత్తెమ్మ గుడివద్ద తాగునీటి ఏర్పాట్లు చేశామన్నారు. 28రోజులుగా అన్నా క్యాంటీన్‌ను కొనసాగిస్తున్నామన్నారు. నాయకులు మల్లికార్జున, శ్రీనివాసులు, చెన్నప్ప, గంగాద్రి, మహేష్, నాగరాజు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సామకోటి ఆదినారాయణ

మహిళల రక్షణలో ప్రభుత్వం విఫలం

● శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్

ధర్మవరం, మార్చి5: మహిళలు, చిన్నపిల్లలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు ఇటీవల కాలంలో అధికమయ్యాయనీ, వీటిని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్ విమర్శించారు. స్థానిక కొత్తపేట బాలికల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవలిగా మహిళల సంరక్షణలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నాంనను. మహిళలపై అఘాయిత్యాల పరంగా దేశంలోనే రాష్ట్రం నాలుగోస్థానంలో ఉందన్నారు. యువతను పెడదోవ పట్టిస్తున్న మద్యాన్ని నియంత్రించాలనీ, సినిమాలు, సామాజిక మాధ్యమాల్లో నీలిచిత్రాలను అరికట్టాలనీ, చదువుకున్న యువతకు ఉపాధి కల్పించాలన్నారు. సమస్యలపై ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ పోరాటాలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున, సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎల్ ఆదినారాయణ, ఎస్ఎఫ్ ఐమండల నాయకులు అనిల్ పాల్గొన్నారు.

10న ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరం, మార్చి 5: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆస్పత్రి సహకారంతో ఈనెల 10వ తేదీన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్టు క్లబ్ అధ్యక్షుడు జయసింహ, వైస్ ప్రసిడెంట్ నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక సాంస్కృతిక మండలిలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. పేదల సౌకర్యార్థం ప్రతినెలా ఉచిత కంటివైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ఇంతవరకు 32,500 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించామన్నారు. కంటిచూపు మందగించిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోటరీ క్లబ్ సభ్యులు ప్రసన్నకుమార్, నాగభూషణ, సోలిగాళ్లవెంకటేశ్, శివయ్య, హరినాథ్, కొండయ్య పాల్గొన్నారు.

చలో అమరావతిని జయప్రదం చేయండి

కదిరిఅర్బన్, మార్చి 5: దివ్యాంగుల హక్కుల సాధనకు ఈనెల 9న చేపట్టనున్న చలో అమరావతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రచార కార్యదర్శి సుబ్బయ్యయాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం పోస్టర్లు విడుదల చేసిన ఆయన మాట్లాడుతూ.. 21 డిమాండ్లతో చలో అమరావతి కార్యక్రమాన్ని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆవరణలో చేపట్టామన్నారు. కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ హాజరవుతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల పట్ల చూపుతున్న వివక్షకు వ్యతిరేకంగా, హక్కుల సాధన కోసం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. దివ్యాంగులకు రూ.ఆరువేలు పింఛన్ ఇవ్వాలనీ, బ్యాక్‌లాగ్ పోస్టులను రోస్టర్ విధానం ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సూర్యనారాయణాచారి, ఎమ్మార్పీఎస్ విశ్వనాథ్, రామాంజులు, గోపాల్‌నాయక్, గజేంద్ర పాల్గొన్నారు.

పరుష ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ముదిగుబ్బ, మార్చి5: మండలంలోని సంకేపల్లి సమీపంలో ఈనెల 9న జరగనున్న వీరనారాయణస్వామి పరుష ఏర్పాట్లను ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, ముదిగుబ్బ సీఐ యతీంద్ర మంగళవారం పరిశీలించారు. స్వామి చుట్టూ ఎద్దులబండ్లు, ట్రాక్టర్లు తదితర వాహనాలను జాగ్రత్తగా తిప్పాలని నిర్వాహకులకు సూచించారు. పరుష నిర్వహించే ప్రాంతంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఇంట్లో చోరీ

ఐదు తులాల బంగారం.. రూ.1.50 లక్షలు మాయం..

గోరంట్ల, మార్చి 5: స్థానిక వినాయక్‌నగర్‌లోని చాకలి శ్రీనివాసులు ఇంట్లో మంగళవారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. బీరువాలోని ఐదుతులాల బంగారం, రూ.1.50 లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. శ్రీనివాసులు శివమాల ధరించాడు. తెల్లవారుజామున 3.45గంటలకు గోరంట్లలోని సోమేశ్వర ఆలయంలో ఇరుముడి ఉండడంతో ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులంతా వెళ్లారు. 4.30గంటలకు భార్య శైలజ ఇంటికి వచ్చింది. ఇంటి తాళం బద్దలుకొట్టి, చోరీ చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. స్క్రూడ్రైవర్‌తో బీరువా తెరచి అందులోని తాళిబొట్టు చైన్, నక్లీసు, రెండు జతల కమ్మలు, మూడు ఉంగారాలు కలిపి మొత్తం ఐదు తులాల బంగారంతో పాటు రూ.1.50లక్షలు నగద ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. కుమారుడు చంద్రశేఖర్ కుప్పంలోని పీఈఎస్ కళాశాలలో ఫిజియోథెరపీ చదువుతున్నాడని, ఫీజు కట్టడానికి నగదు పోగు చేసి ఉంచినట్లు చెప్పారు. ముందురోజు డ్వాక్రా డబ్బులు రూ.50వేలురాగా బీరువాలో భద్రపరిచామని, ఈవిషయం తెలిసినవారే చోరీకి పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.


రామ్మోహన్‌రావుకు నివాళులు అర్పిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

రామ్మోహన్‌రావు సేవలు ఎనలేనివి..

పుట్టపర్తి, మార్చి 5: కార్మికుల సంక్షేమం కోసం నేషనల్ మజ్దూర్ యూనియన్ స్థాపించి, కార్మిక హక్కులను పరిరక్షించిన రామ్మోహన్‌రావు సేవలు ఎనలేనివంటూ నాయకులు కొనియాడారు. మంగళవారం స్థానిక బస్‌డిపోలో రామ్మోహన్‌రావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. 1967లో ఆర్టీసీలో కార్మికుల కోసం ఎన్ఎంయూను ఏర్పాటు చేశారన్నారు. డ్రైవర్లు, కండెక్టర్ల సమస్యలపై యాజమాన్యంతో పోరాడి జీతాల పెంపు, ఉద్యోగభద్రత తీసుకొచ్చిన ఘనత ఆయనదేనన్నారు. కార్యక్రమంలో గంగులయ్య, కేశప్ప, అప్పిరెడ్డి, రాము, జనార్దన్‌రెడ్డి, శివారెడ్డి, లక్ష్మీపతి, రాజేశ్వరి, రాజమ్మ, హరి, గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులపై చర్యలు తీసుకోండి

● ఏఐఎస్ఎఫ్ నాయకుల డిమాండ్

పుట్టపర్తి, మార్చి 5: విద్యార్థులను వేధించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు పవన్, అరుణ్, మహేంద్ర, గణేష్ జిల్లా కేంద్రంలో జేసీ అభిషేక్ కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మంగళకర కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులను కళాశాల అధ్యాపకులు జనార్దన్‌రెడ్డి, జయచంద్రారెడ్డి వేధిస్తున్నారనీ, వీరిపై చర్యలు తీసుకోవాలని జేసీని కోరారు. ప్రగతిశీల విద్యార్థి సంఘం నాయకుడు నరేంద్ర, మరి కొంతమంది.. డీఆర్ఓ కొండయ్యను కలిసి, వినతిపత్రం అందించారు.


జేసీ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కుట్టుమిషన్ల పంపిణీ

కదిరి, మార్చి 5: పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మహిళా సాధికారిత కోసం కుట్టుమిషన్లు, చక్రాల కుర్చీలను పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రీజనల్ మేనేజర్ వెంకటేశ్వరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల్లో ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పెంపొందించి మహిళా సాధికారత సాధించడానికి కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కుట్టు మిషన్ల ద్వారా మహిళలు ఉపాధి పొందవచ్చన్నారు. అలాగే దివ్యాంగులకు చక్రాల కుర్చీలు అందించారు. ఎస్‌బీఐ మేనేజర్ ఫణీకుమార్‌తో పాటు ఇతర బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్లు

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి: ఎంపీపీ

తనకల్లు, మార్చి 5: వేసవిలో ఏగ్రామంలోనూ తాగునీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కౌసల్య పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సాధారణ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ వేసవిలో నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఏ పంచాయతీలో అయినా నిధులు కొరత ఉంటే ఎంపీడీఓ పూల నరసింహుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం విద్యాశాఖపై జరిగిన చర్చలో ఎర్రబల్లి గ్రామంలో పాఠశాల పునః ప్రారంభించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ శ్రీనివాసులు కోరారు. ఉపాధి జాబ్‌కార్డులు పది వేలకుపైగా ఉన్నాయని, ప్రస్తుతం ఐదు వందలమందికూడా పనిచేయలేదని ఏపీఓ మరియమ్మ తెలిపారు. ఉపాధి పనుల్లో పాల్గొనకపోతే కూలీలకు జాబ్ కార్డు తొలగిస్తామన్నారు. తహసీల్దార్ శోభానువర్షమ్మ రెవెన్యూవిషయాలు తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ తమ శాఖద్వారా చేపడుతున్న వివిధ పథకాలను వివరించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు .



మాట్లాడుతున్న ఎంపీపీ కౌసల్య

కార్యకర్తలకు అండగా టీడీపీ : పల్లె


బాబ్జాన్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

కొత్తచెరువు, మార్చి 5: కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రానికి చెందిన మాణిక్యం బాబ్జాన్ సోమవారం జరిగిన రా.. కదలిరా.. బహిరంగ సభకు వెళ్లాడు. అక్కడ రోడ్డు ప్రమాదంలో కాలువిరిగింది. విషయం తెలుసుకున్న మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి మంగళవారం రాత్రి బాబ్జాన్‌ను పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. యువకులకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని పల్లె పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాణక్యం బాబా, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ,ఒలిపి శీనా, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

నల్లమాడ : మండలంలోని యనుములవారిపల్లి గ్రామానికి చెందిన బోయ మల్లప్ప మంగళవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి గ్రామానికెళ్లి మృతదేహానికి పూలమాలువేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. అదే గ్రామానికి చెందిన తిరుపాలప్ప అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందగా పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

చెరువులో మహిళ మృతదేహం

కొత్తచెరువు, మార్చి 5: మండలంలోని పుట్టపర్తి రహదారిపక్కన నాగులకనుమ సమీపంలోని బుక్కపట్నం చెరువులో మంగళవారం గుర్తుతెలియని మహిళ శవం లభ్యమైంది. చెరువులో తేలాడుతున్న శవాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆమె వేసుకున్న పాదరక్షలను చూసి మతిస్థిమితం లేని వృద్ధురాలు అయి ఉండవచ్చని భావిస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ధర్మవరం, మార్చి 5: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ధర్మవరం రైల్వేస్టేషన్‌లో మంగళవారం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు జీఆర్‌పీఎఫ్ ఎస్ఐ గోపీకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గుర్తుతెలియని వ్యక్తి రైల్వేస్టేషన్‌లో భిక్షాటన చేస్తూ ఉండేవాడు. మంగళవారం ఉదయం ప్లాట్‌ఫారం నుంచి మరో ప్లాట్‌ఫారం వద్దకువెళ్లడానికి పట్టాలు దాటుతుండగా.. రైలు రావడంతో ఎటువైపు వెళ్లాలో తెలియక తచ్చాడుతుండగానే రైలు ఢీకొంది. దీంతో కొన ఊపిరితో ఉన్న ఆ వ్యక్తిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.


గుర్తుతెలియని మృతదేహం

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

పెనుకొండ రూరల్, మార్చి 5: భారతీయ స్టేట్‌బ్యాంక్, నాబార్డ్ సౌజన్యంతో మండలంలోని మరువపల్లి, కొండంపల్లి, రాంపురం గ్రామాల్లోని ప్రజలకు మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించినట్లు శెట్టిపల్లి స్టేట్‌బ్యాంక్ మేనేజర్ హరిక్రిష్ణ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, సామాజిక భద్రతా పథకాల గురించి మహిళలకు వివరించారు.

గిరిజన బాలికల కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

గోరంట్ల, మార్చి 5: వివిధ పాఠశాలల్లో ఈ సంవత్సరం పదో తరగతి చదువుతున్న గిరిజన బాలికలు తనకల్లు మండలంలోని సీజీప్రాజెక్టు వద్దగల ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ప్రతిభా కళాశాలలో ఇంటర్ ప్రవేశానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని గోరంట్ల గిరిజన బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ 40, బైపీసీ 40సీట్లు ఉన్నాయి. ఈ సంవత్సరం పది చదువుతున్న గిరిజన బాలికలు 2024-25కు గాను ఇంటర్‌లో చేరడానికి ఈనెల 25లోగా ఆన్‌లైన్‌ద్వారా దర ఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకోసం ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్షను తనకల్లులోని కళాశాలలో నిర్వహిస్తారన్నారు. ఎంపికైన బాలికలకు ఇంటర్‌తోపాటు ఐఐటీ, ఎన్ఈఈటీ, నీట్‌లో శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తిగల అర్హులైన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం సెల్ ఫోన్ నం. 8309005097కు సంప్రదించాలన్నారు.

ఆలయ గోపుర నిర్మాణానికి విరాళం

గోరంట్ల, మార్చి 5: మండలంలోని బోయలపల్లిలో శ్రీపట్టాభిరామస్వామి ఆలయ గోపుర నిర్మాణానికి పాల సముద్రం గ్రామస్థుడు శ్రీనివాసరెడ్డి రూ. 6లక్షలు విరాళం అందించారు. దీంతో గ్రామస్థులు ఆయన చేతుల మీదుగా గోపురం నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. పురోహితులు మధుస్వామి ఆధ్వర్యంలో 21 అడుగుల గోపుర నిర్మాణ పనులకు పూజ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు దాతను సన్మానించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

పెనుకొండ రూరల్, మార్చి 5: భారతీయ స్టేట్‌బ్యాంక్, నాబార్డ్‌వారి సౌజన్యంతో మండలంలోని మరువపల్లి, కొండంపల్లి, రాంపురం గ్రామాల్లోని ప్రజలకు మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించినట్లు శెట్టిపల్లి స్టేట్‌బ్యాంక్ మేనేజర్ హరిక్రిష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బ్యాంకింగ్ సేవలపై వివరించారు. అనంతరం సైబర్‌నేరాల గురించి కళాజాతా ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రామ్మోహన్, బ్యాంక్ సిబ్బంది, కళాజాతా బృందం పాల్గొన్నారు. అనంతరం బ్యాంక్ సిబ్బందికి గ్రామస్థులు అభినందించారు.

మహిళ ఆత్మహత్య


షేక్ ఆయేషా (ఫైల్)

గోరంట్ల, మార్చి 5: పట్టణంలోని కాయగూర్ల మార్కెట్ సమీపంలోని షేక్ ఆయేషా(34) అనే మహిళ ఉరివేసుకుని మంగళవారం ఆత్మహత్య కు పాల్పడింది. బంధువులు తెలిపిన మేరకు వివరా లు ఇలా ఉన్నాయి. చిలమత్తూరు మండలం పలగాలపల్లికి చెందిన రోషన్ కార్పెంటర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్య ఆయేషా, ఎనిమిదో తరగతి చదువుతున్న కుమార్తె సౌపియా, ఆరో తరగతి చదువుతున్న కుమారుడు రిజ్వాన్ ఉన్నారు. ఆ దంపతులు పదేళ్ల కిందట జీవనోపాధి కోసం మార్కెట్ సమీపంలోని పుల్లేరు రోడ్డులో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం సాయంత్రం ఆయేషా చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తమ కుటుంబ ఆర్థిక పరిస్థితులపై ఆమె తరచూ మనోవేదన చెందేవారని, ఈ నేపథ్యంలోనే ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. బంధువులు గుర్తించేసరికే మృతిచెందినట్లు తెలిపారు. సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

శిరివరంలో మరొకరు...

లేపాక్షి, మార్చి 5: మండలంలోని శిరవరం గ్రామంలో తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ గోపి తెలిపిన వివరాల మేరకు... శిరివరం ఎస్సీ కాలనీకి చెందిన ఆది నారాయణప్ప(40) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకొని మృతి చెందాడు. అతడు గ్రామంలో కొబ్బరి బోండాలు విక్రయిస్తూ జీవనం గడిపేవాడు. ఆది నారాయణప్ప భార్య నారాయణమ్మ ఆశాకార్యకర్తగా పనిచేస్తోంది. తాగుడుకు డబ్బు అవసరమైనప్పుడల్లా ఆదినారాయణప్ప భార్యతో తరచూ గొడవ పడేవాడు. అతడు మంగళవారం ఉదయం కూడా మద్యం తాగడా నికి డబ్బు కావాలని భార్యతో గొడవ పడ్డాడు. భార్య నారాయణమ్మ పిల్లలను పాఠశాల వద్ద విడిచి వద్దామని వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి తలుపులకు గడియపెట్టి ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. ఎంత సేపటికి తలుపులు తీయకపోవడంతో కిటికీలో చూసి గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కలవారు వచ్చి తలుపు బద్దలు కొట్టి అతడిని కిందికి దించారు. అప్పటికే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఇంట్లో చోరీ

ఐదు తులాల బంగారం..
రూ.1.50 లక్షల నగదు మాయం


బీరువాను పగులగొట్టిన దృశ్యం

గోరంట్ల, మార్చి 5: పట్టణంలోని వినాయక్ నగర్‌లో నివశిస్తున్న చాకలి శ్రీనివాసులు ఇంట్లో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. బీరువాలోని ఐదుతులాల బంగారం, రూ.1.50 లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. శ్రీనివాసులు శివమాల ధరించాడు. దీంతో తెల్లవారుజామున 3.45గంటలకు గోరంట్లలోని సోమేశ్వర ఆలయంలో ఇరుముడి ఉండడంతో ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులంతా వెళ్లారు. అనంతరం ఉదయం 4.30గంటలకు భార్య శైలజ ఇంటికి వచ్చింది. ఇంటి తాళం బద్దలుకొట్టి, చోరీ చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. స్క్రూడ్రైవర్‌తో బీరువా తెరచి అందులోని తాళిబొట్టు చైన్, నక్లీసు, రెండు జతల కమ్మలు, మూడు ఉంగారాలు కలిపి మొత్తం ఐదు తులాల బంగారంతో పాటు రూ.1.50లక్షలు నగద ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. కుమారుడు చంద్రశేఖర్ కుప్పంలోని పీఈఎస్ కళాశాలలో ఫిజియోథెరపీ చదువుతున్నాడని, ఫీజు కట్టడానికి నగదు పోగు చేసి ఉంచినట్లు చెప్పారు. ముందురోజు డ్వాక్రా డబ్బులు రూ.50వేలురాగా బీరువాలో భద్రపరిచామని, ఈవిషయం తెలిసినవారే చోరీకి పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

శంఖారావం సభకు భారీ ఏర్పాట్లు


శంఖారావం ఏర్పాట్లను పరిశీలిస్తున్న సవిత

పెనుకొండ టౌన్, మార్చి 5: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన శంఖారావం కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం పెనుకొండలో నిర్వహిస్తు న్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఆమె మంగళవారం స్థానిక నాయకులతో కలిసి శంఖారావం ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ..శంఖారావంలో భాగంగా నారా లోకేశ్ వైసీపీ అరాచకాలు, జగన్ పాలనా వైఫల్యాలు, ఆయా నియోజకవర్గాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నేతల దోపిడీలు, ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయించడం, వేధించడం లాంటి అంశాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతారన్నారు. జగన్ పాలనలో నష్టపోయిన వివిధ వర్గాలను కలిసి వారికి భరోసా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రఘువీరచౌదరి, గోరంట్ల నాయకులు బాలకృష్ణ చౌదరి, ఉత్తంరెడ్డి, రవీంద్రనాయక్, మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, బాబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రా.. కదలిరా.. సభ విజయవంతంపై కృతజ్ఞతలు

పెనుకొండ టౌన్: అధికార పార్టీ వైసీపీకి వణుకు పుట్టే తరహాలో టీడీపీ అధినేత రా.. కదలిరా.. బహిరంగ సభ పెనుకొండలో ఘనంగా సాగిందని పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత అన్నారు. ఆమె మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో టీడీపీ శ్రేణులతో సమావేశం ఏర్పాటుచేశారు. చంద్రబాబు సభను విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలను కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాసులు, వెంకటరమణ, పాలడుగు చంద్ర, మావటూరు గోపాల్, త్రివేంద్ర పాల్గొన్నారు.

మంత్రి కండువాల కథను ఎవరూ నమ్మరు: సవిత

పెనుకొండ టౌన్, మార్చి 5 : ఇతర ప్రాంతాలవాసులకు కండువాలువేసి వైసీపీలో జోష్ పెరిగిందని ఆర్భాటాలు పలుకుతున్న మంత్రి కండువాల కహానీని నియోజకవర్గ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత అన్నారు. ఆమె మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.... మంత్రి ఉష వైసీపీ నాయకులకే కండువాలు వేస్తున్నారని విమర్శించారు. అలాగే పోలీసులు, వలంటీర్లను అడ్డుపెట్టుకుని బెదిరింపులతో మంత్రి సమక్షంలో చేరికలు చేస్తున్నారన్నారు. పైగా మంత్రి వద్దకు సమస్యల కోసం వెళ్లే వారికి కూడా కండువాలు వేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారన్నారు. ఇందుకు వలంటీర్లను వాడుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం వస్తే వలంటీర్లకు నజరానాతోపాటు ఇంటిపట్టాలు ఇస్తామని ఎమ్మెల్యే అంటున్నారని, ఇదే ఎమ్మెల్యే కళ్యాణదుర్గంలో వలంటీర్లకు ఏమి ఇచ్చారో చెప్పాలని నిలదీశారు. స్థానిక వలంటీర్లు కూడా ఆలోచించాలన్నారు. వలంటీర్లపై ఒత్తిడి తెస్తుంటే చేసేదేమీలేక వారు మంత్రి సమక్షంలో పలువురికి కండువాలు వేయిస్తున్నారని అన్నారు. ఏది ఏమైనా తెలుగుదేశం పార్టీ గెలుపును ఆపేది ఎవరితరం కాదన్నారు.

శంఖారావం సభను విజయవంతం చేయండి

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్


విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ సునీల్‌కుమార్

మడకశిర టౌన్, మార్చి 5: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ గురువారం మడకశిర నియోజకవర్గంలో శంఖారావం సభ నిర్వ హిస్తా రని, వర్గ విభేదాలు వీడి కార్యక్రమం విజయవంతం చేయాలని టీడీపీ మడకశి ర నియోజకవర్గం అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. ఆయన మంగళ వారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న, టీడీపీ నాయకులతో కలసి పట్టణ సమీపంలోని చీపులేటి వద్ద సభా స్థలం పరిశీలించారు. అనం తరం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శంఖా రావం కార్యక్రమంలో భాగంగా నారా లోకేశ్ గురువారం మధ్యాహ్నం 12 గంటలకు మడకశిర చేరుకుంటారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అక్ర మాలు, దౌర్జన్యాలు, అవినీతిని ఎండగట్టాలన్నారు. అలాగే పేదలకు మంచి పరి పాలన అందించాలన్న లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేందుకు అందరూ సమష్టిగా కృషి చేద్దాం అని పిలుపునిచ్చారు. అనంతరం లోకేశ్ పర్యటనను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. నియోజకవర్గంలోని టీడీపీ బూత్ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు అందరూ హజరై శంఖారావం కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు కిష్టప్ప, రాజగోపాల్, ఈశ్వర్‌సాగర్, నరేసేగౌడ్, మంజునాథ్ తదితరులు ఉన్నారు.

రొళ్ల: తెలుగుదేశం పార్టీ యువనేత నారా లోకేశ్ గురువారం మధ్యాహ్నం మడకశిర సమీపంలోని చీపులేటి వద్ద నిర్వహిస్తున్న శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా కార్యదర్శి రవిభూషణ్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని టీడీపీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

అగళి: మడశరి పట్టణ సమీపంలోని చీపులేటి వద్ద జరిగే తెలుగుదేశం పార్టీ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ రామక్రిష్ణ, నాయకులు అలీఖాన్, శివలింగప్ప, నాగోజీ, దినేష్, క్యాతప్ప, తదితరులు కోరారు. నారా లోకేశ్ పాల్గొనే ఈ కార్యక్రమానికి మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

'పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలి'


విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, మార్చి5 : ప్రతి విద్యార్థి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ప్రధానోపాధ్యాయుడు నాగార్జునుడు తెలిపారు. మండలంలోని గుట్టూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం సరస్వతి పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సరస్వతిదేవి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమా లు ఆకట్టుకున్నాయి. అనంతరం గుట్టూరుకు చెందిన ఎల్ఐసీ ఏజెంట్ వెంకటేశ్ పదో తరగతి చదువుతున్న 60మంది విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లు, జామెంట్రీబాక్స్‌లు, స్కెచ్‌పెన్నులు విరతణ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్ నజీర్, ఎల్ఐసీ మేనేజర్ గుణశేఖర్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి: సీడీపీఓ

గుడిబండ, మార్చి 5: మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణించాలని సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. గుడిబండ సీడీపీఓ కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ... మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మహిళతోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం మహిళలకు వివిధ పోటీలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సక్రమంగా విధులు నిర్వహించి చిన్నారుల అభివృద్ధికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కమలమ్మ, అంగనవాడీ యూనియన్ అధ్యక్షురాలు మహదేవమ్మ, సుజాతమ్మ, బీమాబాయి, దేవీరమ్మ, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ధర్మవరం, మార్చి 5: రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ధర్మవరం రైల్వేస్టేషన్‌లో మంగళవారం పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొనడంతో ప్రమాదం జరిగినట్లు జీఆర్‌పీఎఫ్ ఎస్ఐ గోపీకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు... గుర్తుతెలియని వ్యక్తి రైల్వేస్టేషన్‌లో బిక్షాటన చేస్తూ ఉండేవాడు. అయితే మంగళవారం ఉదయం ప్లాట్‌పారం నుంచి మరో ప్లాట్‌పారం వద్దకువెళ్లడానికి పట్టాలు దాటుతున్నారు. హఠాత్తుగా రైలు రావడంతో ఎటువైపు వెళ్లాలో తెలియక తచ్చాడుతుండగానే రైలు ఢీకొంది. దీంతో కొన ఊపిరితో ఉన్న ఆ వ్యక్తిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

బీఎస్పీ ఎంపీ అభ్యర్థిగా నాగరాజు

హిందూపురం అర్బన్, మార్చి 5: బహుజన సమాద్‌వాదీ పార్టీ హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థిగా కొల్లకుంట నాగరాజును ఎంపిక చేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు తెలిపారు. ఆయన మంగళవారం పార్టీ స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఈ విషయం ప్రకటించారు. ఈ సందర్భంగా సినీ నిర్మాత, బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు కొల్లకుంట నాగరాజు మాట్లాడుతూ... ఎంపీ అభ్యర్థిగా తనను చేసిన తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, పరంజ్యోతికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి హరికుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు నాజీమ్‌బాష, పట్టణాధ్యక్షుడు దాసరి ఈశ్వరయ్య తదితరులు ఉన్నారు.

కియలో యువకుడి హఠాన్మరణం

పెనుకొండ రూరల్, మార్చి 5: పెనుకొండ సమీపంలోని కియ కార్లపరిశ్రమలో సాయిలింగ(25)అనే యువకుడు సోమవారం హఠాన్మరణం చెందినట్లు కియ ఎస్ఐ రంగడు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం రూరల్ మండలంలోని రాచానపల్లి కి చెందిన చాకలి సుబ్బయ్య, పార్వతమ్మ దంపతుల కుమారుడు సాయిలింగ రెండేళ్లుగా కియ పరిశ్రమలో ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా ఉన్న అతడిని సోమవారం ఉన్నఫలంగా ఛాతీలో నొప్పి రావడంతో కుప్పకూలాడు. తోటి ఉద్యోగులు హుటాహుటిన ప్రథమ చికిత్సల అనంతరం అనంతపురంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే అతడు అప్పటికే మృతిచెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కరాటే పోటీల్లో పురం విద్యార్థికి ప్రథమస్థానం


ప్రతిభా విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

హిందూపురం అర్బన్, మార్చి 5: అంతర్‌జిల్లా కరాటే పోటీల్లో హిందూపురానికి చెందిన అల్‌అమీన్ పాఠశాల విద్యార్థి అనస్‌కు ప్రథమ స్థానం దక్కిందని కరస్పాండెంట్ రియాజ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక పాఠశాలలో ప్రతిభా విద్యార్థిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 3వ తేదీన గుంతకల్లు పట్టణంలో జరిగిన ఆరో అంతర్‌జిల్లా కరాటే పోటీల్లో 500 వందల మంది పాల్గొన్నారన్నారు. బీ కెటగిరిలో విద్యార్థి అనస్‌కు ప్రథమ స్థానం దక్కింద న్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ న్యామతున్నిసా, ఉపాధ్యాయులు ఉన్నారు.

రెండు నెలలుగా నీటి వృథా

● పట్టించుకోని పంచాయతీ అధికారులు ● స్థానికుల ఆవేదన

గోరంట్ల, మార్చి 5: పట్టణంలోని బాలికల ఉన్నతపాఠశాల వద్ద సిస్టన్ నుంచి నీరంతరం నీరు వృథా అవుతోంది. అయినా పంచాయతీ అధికారులు పట్టించు కోవడం లేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. పట్టణంలోని ఆ ప్రాంత ప్రజల సౌకర్యార్థం మాజీ సర్పంచ్ నాగరాజురావు జ్ఞాపకార్థం వారి కుమారులు తమ ఆర్థిక సాయంతో పంచాయతీ ద్వారా 2014లో సిస్టన్ ఏర్పాటు చేశారు. దానికి కొళాయిలు ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. కాలక్ర మేణ కొళాయిలు విరిగిపోవడంతో ప్రజలు సిస్టన్‌లోని నీటిని వినియోగించుకోలేక పోతున్నారు. ఇదిలా ఉండగా సమీపంలోని పంచాయతీ స్థలంలో వేసిన బోరు నుంచి బాలికల ఉన్నత పాఠశాలకు, సిస్టన్‌కు ప్రత్యేక పైపులైన్ ఉంది. దాని నుంచి వచ్చే నీరు నేరుగా సిస్టన్‌లోకి వెళ్తుంది. అయితే ఆ నీటిని ప్రజలు తెచ్చుకునేందుకు కొళాయిలు లేకపోవడంతో సిస్టన్‌లో నుంచి వృథాగా కారిపోతూ మురుగునీటిలో కలుస్తోంది. అంతేగాకుండా పంచాయతీ బోరు స్టార్టర్ బాక్స్‌కు తాళం లేదు. దానని ఓ చెట్టుకు వేలాడదీశారు. దీంతో ఎవరుబడితే వారు మోటార్ ను ఆన్ చేస్తుండడంతో నిత్యం నీరు వృదా అవుతోం దని స్థానిక మహిళలు తెలిపారు. ఇలా దాదాపు రెండు నెలలుగా జరుగుతోందని, పంచాయతీ అధికారులుకు తెలిపినా ఎవరూ పట్టించుకోవడం లేదన వారు ఆరోపిస్తున్నారు. తమకు నీరు అవసరమున్నా, సిస్టన్‌కు కొళాయిలు లేకపోవడంతో ఆ నీటిని ఉపయోగించుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నామని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి సిస్టన్‌కు కొత్త కొళాయిలు బిగించాలని స్థానికులు కోరుతున్నారు.


వృథా అవుతున్న నీరు

ఉపాధి సిబ్బంది నిరసన

మడకశిర రూరల్, మార్చి5: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారం మంగళవారం నల్లబ్యాడ్జీలతో స్థానిక ఉపాధి హామీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ ఏపీఓ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ... ఉపాధి హామీ పథకంలో లో పనిచేస్తున్న ఏపీఓలకు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు గ్రేడ్ ఫిక్షన్‌తో పాటు 23శాతం పీఆర్‌సీ ఇవ్వాలని కోరారు. ఇంత వరకు తమకు పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లను వెంటనే చెల్లించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఏపీఓతో పాటు టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి: ఎంఈఓ

లేపాక్షి, మార్చి 5: ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరేందుకు విద్యార్థులందరూ ఉచిత విద్యకోసం బుధవారం నుంచి ఈనెల 25వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ నాగరాజునాయక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరంలో అన్ని ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలోనూ విద్యాహక్కు చట్టం 2019 సెక్షన్12(1సి) అమలు చేసిందన్నారు. ప్రవేశం కోసం అర్హతలు ఆన్‌లైన్‌లో చూసుకోవాలని సూచించారు. పాఠశాల నుంచి 1కి.మి., 3కి.మి. పరిధిలో ఉన్న వారిని పరిశీలిస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థుల జాబితా వివరాలను సంబంధిత పాఠశాలలో పొందు పరుస్తామ న్నారు. ఉచిత విద్యను కోరే విద్యార్థులు ఆయా పాఠశాల పేరుపై ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాల న్నారు. ప్రతి ప్రైవేట్ పాఠశాలలోనూ 25శాతం సీట్లు ఉంటాయన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

రొద్దం, మార్చి 5 : మండలంలోని చిన్నమంతూరు ఎస్సీకాలనీలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ బుధవారం చేపడుతున్నట్లు టీడీపీ నాయకులు పవన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, అన్నదానం ఉంటుందన్నారు. విగ్రహదాత, టీడీపీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత ముఖ్య అతిథిగా వచ్చి విగ్రహావిష్కరణ చేస్తారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

కంచిసముద్రంలో రెండు వర్గాల ఘర్షణ

రొద్దం, మార్చి 5: మండలంలోని కంచిసముద్రం గ్రామంలో మురళి వర్గీయులు, గోవర్ధన్ వర్గీయుల మధ్య పాత కక్షల కారణంగా గొడవ జరిగింది. మురళి వర్గీయులైన గాయత్రి, మీసాల నరసింహప్ప, గిరిజమ్మ మంగళవారం సుజాత, మమత, రామాంజనమ్మ, గోవర్ధన్‌పై దాడిచేశారు. ఈ దాడిలో సుజాత, మమత, గోవర్ధన్, రామాంజనమ్మకు మూగదెబ్బలు బలంగా తగలడంతో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ వలీబాష గ్రామంలోకి వెళ్లి విచారించారు. ఇరువర్గాలు బుధవారం పోలీస్ స్టేషన్‌కు రావాలని తెలిపారు. గొడవలు చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెరువులో మహిళ మృతదేహం

కొత్తచెరువు, మార్చి 5: మండలంలోని పుట్టపర్తి రహదారిపక్కన నాగులకనుమ సమీపంలోని బుక్కపట్నం చెరువులో మంగళవారం గుర్తుతెలియని మహి ళ శవం లభ్యమైంది. చెరువులో తేలాడుతున్న శవాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆమె వేసుకున్న పాదరక్షలను చూసి మతిస్థిమితం లేని వృద్ధురాలు అయి ఉండవచ్చని భావిస్తున్నారు.

రాగిమేకలపల్లిలో అశ్వత్థం స్థల వివాదం

గోరంట్ల, మార్చి 5: మండలంలోని కే రాగిమేకలపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న అశ్వత్థం కట్ట స్థల వివాదం నెలకొనడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల గ్రామంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులందరూ ఐకమత్యంతో ఆలయ సమీపంలో అశ్వత్థం కట్ట నిర్మాణానికి శ్రమదానం చేస్తూ పనులుచేపట్టారు. అయితే అదే గ్రామానికి చెందిన వడ్డె వెంకటలక్ష్మమ్మ అశ్వత్థం కట్ట నిర్మిస్తున్న స్థలం తనదేనంటూ అభ్యంతరం తెలిపింది. దీంతో ఘర్షణవాతారణ నెలకొనగా, ఆమె గోరంట్ల పోలీస్‌స్టేషన్‌లో లక్షా్మనాయక్, వెంకటరమణనాయక్‌తో పాటు మరో నలుగురిపై ఫిర్యాదుచేశారు. దీంతో పోలీసులు మంగళవారం ఫిర్యాదులో పేర్కొన్న వారిని విచారణకోసం స్టేషన్‌కు రావాలని ఆదేశించారు. దీంతో గ్రామస్థులు అధిక సంఖ్యలో పోలీస్‌స్టేషన్‌కు మంగళవారం సాయంత్రం చేరుకోగా, వారి చర్యపట్ల పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతసేపు ఉద్రిక్త వాతావరణ నెలకొంది. అనంతరం పోలీసులు సర్దిచెప్పి పంపారు. స్థల వివాదంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు

గుడిబండ, మార్చి 5 : మండలకేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని చీఫ్ సూపరింటెండెంట్ రామక్రిష్ణా నాయక్, డీఓ జగన్నాథ్ తెలిపారు. కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పరీక్షలకు 179మందికిగాను 175మంది విద్యార్థులు హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదని వారు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ మునిప్రతాప్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

డంప్ యార్డు కంచెకు నిప్పు


మండుతున్న డంప్ యార్డు కంచె

రొద్దం, మార్చి 5: మండల కేంద్రంలో డంప్ యార్డు కంచెకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో కాలి బూడిదైంది. రొద్దంలోని డంప్‌యార్డ్ కంచెకు, శ్మశాన వాటికకు ఉన్న కంచెకు మంగళవారం నిప్పంటుకోవడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. బీసీ కాలనీవైపు మంటలు వ్యాపిస్తుండగా స్థానికులు నీళ్లుపోసి మంటలను ఆర్పేశారు. గడ్డివాముకు నిప్పంటుకుంటుందేమోనని కాలనీవాసులు భయపడ్డారు. అగ్నిమాపక యంత్రానికి ఫోన్‌చేయగా అది వచ్చేలోపు గ్రామస్థులే మంటను ఆర్పేశారు. ఎలాంటి ఆస్తినష్టం సంభవించలేదు.

అనాథ పిల్లలను ఆదుకోవాలి

సర్వధర్మ శాంతి పీఠం అధ్యక్షుడు రామ్మూర్తి స్వామీజీ

పావగడ, మార్చి 5: తాలూకా వ్యాప్తంగా చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయిన 120 మందికిపైగా చిన్నారులు ఉన్నారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని సర్వధర్మ శాంతి పీఠం అధ్యక్షుడు రామ్మూర్తి స్వామీజీ పేర్కొన్నారు. ఆయన మంగళవారం ఆశ్రమంలో విలేకరులతో మాట్లాడుతూ... తాలూకా వ్యాప్తంగా 2018లోనే సర్వే చేసి తల్లిదండ్రులను కోల్పోయిన అనాథలను గుర్తించామని, 2020సంవత్సరంలో కర్ణాటక ముఖ్యమంత్రికి, ప్రధాని నరేంద్రమోదీకి, అప్పటి ఉమ్మడి అనంతపురం జిల్లా కలెక్టర్ గంధం చంద్రుడు దృష్టికి ఈవిషయాన్ని తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరి ఖాతాలోకి రూ.15లక్షలు జమ చేస్తామని ప్రధాని నరేంద్రమోదీ 2015లో చెప్పినప్పటికీ అమలు కాలేదన్నారు. ఇప్పటికైనా ఆ పిల్లల పేరిట రూ.15లక్షలు చొప్పున ఎఫ్‌డీ చేసి దానితో వచ్చిన వడ్డీతోనే వారి ఉన్నతచదువులకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు.

చిన్నారులకు చేయూత

పావగడ, మార్చి 5: తాలూకా పరిధిలోని దేవరబెట్ట గ్రామంలో నివసిస్తున్న ముగ్గురు అనాథపిల్లల కుటుంబానికి హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్ మంగళవారం విద్యా సామగ్రి, సరుకులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన రంగమ్మ, రంగధామప్ప దంపతులకు రాగేష్, ధనుష్, మను అనే ముగ్గురు కుమారులున్నారు. మూడేళ్ల క్రితం కరోనా సమయంలో వారి తల్లిదండ్రులు మృతి చెందడంతో వారి ఆలనా, పాలను మృతుడు రంగధామప్ప తల్లి పుట్టమ్మ చూస్తున్నారు. ఈవిషయం తెలుసుకొన్న హెల్ప్ సొసైటీ ఆ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఆ ముగ్గురు చిన్నారులకు నిత్యావసర సామగ్రి, సరుకులను పంపిణీ చేసి మానవత్వం చాటుకొన్నారు. అదేవిధంగా వారి ఖర్చులకు సరిపడు నగదు కూడా తమ సంస్థ తరఫున అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు భవానీ, సాయికిరణ్, నరేష్, సాగర్, నరసింహ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.